క్లుప్తంగా

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ ప్రజావేదికను శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగే కార్యక్రమానికి డ్వామా పీడీ గంగాభవాని హాజరవుతారని చెప్పారు. పనులకు సంబంధించి ప్రజలకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే ప్రజావేదిక దృష్టికి తీసుకురావచ్చునని తెలిపారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం



చేజర్ల: మండలంలోని ఎన్వీకండ్రిగకు చెందిన పేద విద్యార్థిని ఎస్ పుష్పలతకు యూటీఎఫ్ నాయకులు గురువారం రూ.20వేలు సాయం అందజేశారు. చేజర్లలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఎంఈఓ–2 డీసీ మస్తానయ్య చేతుల మీదుగా నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇడుపులపాయలోని ట్రిపుల్ఐటీలో చదువుతున్న పుష్పలతకు ఆర్థిక సాయం అందజేసిన యూటీఎఫ్ నాయకులను అభినందించారు. తహసీల్దార్ బీ మురళి, ఎంపీడీఓ విజయలలిత, యూటీఎఫ్ మండల నాయకులు ఎం రవిబాబు, రమణయ్య, వెంకటకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ గ్రామోత్సవం



సంగం: మండలంలోని అన్నారెడ్డిపాళెంలో బుధవారం రాత్రి పోలేరమ్మ గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కనుమ పండగ సందర్భంగా పోలేరమ్మను విశేషంగా అలంకరించి గ్రామోత్సవం జరిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వింజమూరు(ఉదయగిరి): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వింజమూరు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని బత్తినవారిపల్లిలో గురువారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల శుభ్రతపై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలని వైద్యసిబ్బందికి సూచించారు. పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, వైద్యారోగ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ



కావలి: పట్టణానికి చెందిన న్యాయవాది ఐ సాయిప్రసాద్ తన పుట్టిన రోజును పురస్కరించుకుని 6వ వార్డు పరిధిలోని గిరిజన కాలనీవాసులకు దుస్తులు, అంగన్‌వాడీ చిన్నారులకు గణిత పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. న్యాయవాదులు అభిసాగర్, చంద్రశేఖర్‌రెడ్డి, సాయికృష్ణ, సామాజిక కార్యకర్త ఎం మాలకొండారెడ్డి, అంగన్‌వాడీ టీచర్ పద్మకుమారి పాల్గొన్నారు.

రంగవల్లుల పోటీలు



మర్రిపాడు : సంక్రాంతిని పురస్కరించుకుని తిక్కవరంలో రంగవల్లుల పోటీలను గురువారం నిర్వహించారు. ప్రథమ బహుమతిని ఏ శ్రీదేవి, ద్వితీయ బహుమతిని స్వప్న, తృతీయ బహుమతిని సరస్వతి గెలుపొందగా మర్రిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి గోపినాథ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల యువజన అధ్యక్షుడు చంద్ర నారాయణస్వామి, నాయకులు గంగినేని విజయ్‌కుమార్, బోయపాటి సుబ్బారాయుడు, బీ నాగేశ్వరరావు, జీ వినోద్, టీ సాయి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో దాడి

ఆత్మకూరు: నల్లపరెడ్డిపల్లికి చెందిన అమీర్, అన్వర్ గురువారం మున్సిపల్ పరిధిలో బట్టేపాడు మార్గంలో ఉన్న మద్యం దుకాణం వద్ద మద్యం సేవిస్తుండగా ఇరువురి మధ్యన వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో అన్వర్ తనపై బీరుబాటిల్‌తో దాడి చేసినట్లు అమీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కే జిలానీ తెలిపారు.



కావలి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



కావలి బస్టాండ్‌లో సిద్ధంగా ప్రత్యేక సర్వీసులు

తిరుగు పయనం

- సంక్రాంతి పండగ ముగియడంతో సొంతూర్లకు బైబై
- పట్టణాలు, నగరాల బాట పట్టిన ఉద్యోగులు, వలస కార్మికులు
- కావలి ఆర్టీసీ బస్టాండ్,రైల్వే స్టేషన్‌లో రద్దీ

కావలి: సంక్రాంతి పండగకు పట్టణాలు, నగరాల నుంచి ఉద్యోగులు, వలస కార్మికులు స్వగ్రామాలకు చేరుకున్నారు. పెద్ద పండగ మూడ్రోజుల పాటు కుటుంబ సభ్యులు, బంధువులతో సంతోషంగా గడిపారు. పండగ ముగియడంతో గురువారం తిరుగుపయనమయ్యారు. స్వగ్రామాలను వీడి పట్టణాలు, నగరాల బాట పట్టారు. కావలి పట్టణంతో పాటు చుట్టపక్కల గ్రామాలకు చెందిన వారు పెద్ద ఎత్తున కావలి ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు రైల్వేస్టేషన్‌కు చేరుకోవడంతో రద్దీ నెలకొంది. కావలి నుంచి హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం, చెన్నై, విజయవాడ, తదితర ప్రాంతాలకు ప్రయాణించేవారు ఎక్కువగా ఉండడంతో అందుకనుగుణంగా ఆర్టీసీ బస్సులను నడుపుతోంది. రిజర్వేషన్లు చేయించుకోని ప్రయాణికులు కావలి ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చే జిల్లాలోని ఇతర డిపోలతో పాటు ఇతర జిల్లాలకు చెందిన ఆర్టీసీ బస్సుల్లో గమ్యస్థానాలకు పయనమవుతున్నారు. కాగా ప్రయాణికుల రిజర్వేషన్లకు అనుగుణంగా ప్రత్యేక బస్సుల సంఖ్యను పెంచుతామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. 19వ తేదీతో పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ముగియనున్నాయి. శని, ఆదివారాల్లో ఎక్కువ మంది తిరుగు పయనమవనున్నారు. ఆ రోజుల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుందనే అంచనాతో ఆర్టీసీ అధికారులు ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకున్నారు.

దొంగలపై అప్రమత్తం

ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో ప్రయాణ హడావుడిలో ఉన్న ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని దొంగలు చేతివాటం ప్రదర్శించే అవకాశం ఉంది. కావలి ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కే సమయంలో ప్రయాణికుల పర్సులు, హ్యాండ్ బ్యాగులు కొట్టేసిన ఘటనలు గతంలో చోటు చేసుకుని ఉన్నాయి. అలాగే రైల్లో కిటికీ పక్కన కూర్చున్న మహిళా ప్రయాణికుల మెడలోని ఆభరణాలను బయటి నుంచి దొంగలు లాక్కుపోయే ప్రమాదం ఉంది. ప్రయాణంలో సహచర ప్రయాణికుల్లా మాటలు కలిపే అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి. వారిచ్చే ఎటువంటి తినుబండారాలు తీసుకోకూడదు. రైలు కోసం నిరీక్షించే సమయంలో ప్లాట్‌ఫామ్ అంచున నిలబడకూడదు. దీనివల్ల ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంటుంది. అలాగే రైల్వేస్టేషన్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి మార్గం ఉన్నప్పటికీ ప్లాట్‌ఫామ్‌లపైకి చేరుకునేందుకు కొందరు రైలు పట్టాలు దాటేస్తుంటారు. ఇది చాలా ప్రమాదకరం. రైలు కదిలేవరకు ప్లాట్‌ఫామ్‌పై నిలబడి రైలు కదలగానే పరుగెత్తి ఎక్కుతూ కింద పడిపోయి ప్రమాదాల బారిన పడిన సందర్భాలు ఉన్నాయి. అందువల్ల ప్రయాణికులు తగిన జాగ్రత్తలు పాటించి ప్రయాణించాల్సిన అవసరం ఉంది.

ప్రత్యేక సర్వీసులు

జిల్లాలోని ముఖ్యమైన పట్టణాల నుంచి బెంగళూరు, హైదరాబాద్‌లకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం. ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు జిల్లా నుంచి బెంగళూరుకు 30 బస్సులు నడుపుతున్నాం. ఆత్మకూరు, కావలి, నెల్లూరు–2, రాపూరు, ఉదయగిరి డిపోల నుంచి ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రతిరోజు 5 నుంచి 7 బస్సులు నడుపుతాం. హైదరాబాద్‌కు 51 బస్సులు నడుపుతున్నాం. ఆత్మకూరు, కావలి, కందుకూరు, నెల్లూరు–1, ఉదయగిరి డిపోల నుంచి ప్రతిరోజూ 11 నుంచి 8 బస్సులు వరకు నడుపుతున్నాం. సంక్రాంతి పండగకు స్వగ్రామాలకు వచ్చిన వారు సురక్షితంగా తిరిగి తమ విద్య, ఉద్యోగ, ఉపాధి ప్రాంతాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలి. **–మురళీబాబు, జిల్లా ప్రజారవాణాధికారి, నెల్లూరు**

అధైర్యపడొద్దు

అండగా ఉంటాం



ఆత్మీయ సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



రాజగోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న పార్టీ నేతలు

ఉదయగిరి: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడాల్సిన పనిలేదని, అండగా ఉంటామని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో గురువారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు టీడీపీ నేతలు పెడుతున్న ఇబ్బందులు, పోలీసుల వ్యవహారశైలిని మేకపాటి దృష్టికి తెచ్చారు. అనంతరం మేకపాటి మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలను గుర్తుంచుకుంటామన్నారు. తమ కార్యకర్తలను ఎవరైతే ఇబ్బంది పెడుతున్నారో వారిపై తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అంతకు రెట్టింపు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మిమ్మల్ని ఇబ్బంది పెట్టిన వారి పేర్లు రాసిపెట్టుకోండి, వారిని వదిలిపెట్టేది లేదన్నారు. తమ పార్టీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్న పోలీసు అధికారులను వదిలిపెట్టేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వరికుంటపాడు ఎస్సై వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని ఇబ్బంది పెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, కాలం ఎప్పుడు ఇలాగే ఉండదని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడ ఉన్నా వదిలిపెట్టమన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చిన జగన్ సీఎం కావడం ఖాయమని, ఇప్పటికే టీడీపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ఎన్నికల సమయంలో హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చాక ఒక్క హామీని కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ఇంత అన్యాయమైన పాలనను గతంలో ఎప్పుడూ చూడలేదన్నారు. అధికారులు కూడా న్యాయం, అన్యాయాన్ని గమనించి ప్రజలకు అండగా ఉండాలన్నారు. తప్పు చేసిన అధికారులు తగిన సమయంలో శిక్ష అనుభవించక తప్పదన్నారు. అనంతరం జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు పల్లాల కొండారెడ్డి అధ్వర్యంలో మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, యువనేత అభినవ్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు గణపం బాలకృష్ణారెడ్డి, పావులూరి మాల్యాద్రిరెడ్డి, చేజర్ల సుబ్బారెడ్డి, షేక్ అలీఅహ్మద్, చింతరెడ్డి సుబ్బారెడ్డి, చిన్నికృష్ణారెడ్డి, వీరారెడ్డి, నారపరెడ్డి, అక్కి భాస్కరరెడ్డి, తమ్మల వెంగయ్య, ఇస్కా మదన్, కాటం రవీంద్రరెడ్డి, సీఎం ఓబులరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శారీరక, మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



మర్రిపాడు: విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న ఎస్సై శ్రీనివాసులు



వింజమూరులో విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న అభినవ్‌రెడ్డి

మర్రిపాడు: శారీరక, మానసికోల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడుతాయని మర్రిపాడు ఎస్సై కాసుల శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని చుంచులూరులో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన కంచి వెంకటసుబ్బయ్య స్మారక క్రికెట్ టోర్నమెంట్ గురువారంతో ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో రాజుపాళెం, చుంచులూరు జట్లు తలపడ్డాయి. రాజుపాళెం జట్టు విజేతగా నిలిచి రూ.20,116 నగదు, ట్రోఫీ, చుంచులూరు జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి రూ.15,116 నగదు, ట్రోఫీని గెలుచుకున్నాయి. మర్రిపాడు ఎస్సై కాసుల శ్రీనివాసులు టోర్నమెంట్ నిర్వాహకుడు కంచి రాముతో కలిసి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా నేరాల నియంత్రణ చర్యల్లో భాగంగా చుంచులూరు హైవేపై సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని కోరగా, వాటిని ఏర్పాటు చేసేందుకు కంచి రాము అంగీకరించారు. విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ కలిశెట్టి రఘు, గ్రామపెద్దలు కలిశెట్టి వెంకటరమణయ్య, జొన్నా సత్యనారాయణ, దువ్వూరు జయదేవ్, ఇరుకుమాటి మురళి, కలిశెట్టి శివరావు, తదితరులు పాల్గొన్నారు.

వింజమూరు(ఉదయగిరి): యువత క్రీడల్లోనూ రాణించాలని వైఎస్సార్‌సీపీ యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డి అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని వింజమూరులోని యర్రబల్లిపాళెం యువత ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి క్రికెట్ పోటీల విజేతలకు గురువారం ఆయన బహుమతులను ప్రదానం చేశారు. యువత కూడా చెడువ్యసనాలకు దూరంగా ఉండి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లాల కొండారెడ్డి, చిన్నికృష్ణారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, లెక్కల సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

- ఉదయగిరి మండలం కృష్ణారెడ్డిపల్లెలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో దేకూరుపల్లి జట్టు ప్రథమ, బిజ్జంపల్లి జట్టు ద్వితీయ బహుమతిని గెలుచుకున్నాయి. విజేతలకు గురువారం బహుమతులను ప్రదానం చేశారు. స్థానిక నేతలు కాకు వెంకటయ్య, రాజగోపాల్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, బాషామొహిద్దీన్ పాల్గొన్నారు.

కలిగిరి: కృష్ణారెడ్డిపాళెంలో నిర్వహించిన కేఆర్‌పీఎల్ జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో కృష్ణారెడ్డిపాళెం యూత్ 11 జట్టు విజేతగా నిలిచి రూ.15,016, కేఆర్‌పీఎల్ హోం జట్టు రన్నర్‌గా నిలిచి రూ.7,016 నగదు బహుమతులతో పాటు ట్రోఫీలను అందుకున్నాయి.

సోమశిల: అనంతసాగరం మండలం పడమటికంభంపాడులో హెల్పింగ్ హార్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో అనంతసాగరం ముజ్జు టీమ్ 11 విజేతగా నిలిచింది. హెల్పింగ్ హార్ట్స్ అసోసియేషన్ పడమటికంభంపాడు జట్టు రన్నర్‌గా నిలిచింది. విజేత జట్టుకు బీఆర్‌ఐటీ టెక్నాలజీ సాయంతో రూ.25వేలు, రన్నర్ జట్టుకు హెల్పింగ్ హార్ట్స్ సహకారంతో రూ.15వేలు నగదును అందజేశారు.



కలిగిరి: విజేతగా నిలిచిన కృష్ణారెడ్డిపాళెం యూత్ 11 జట్టు

అన్నారెడ్డిపాళెంలో చోరీ

సంగం: ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొట్టి రూ.60 వేల విలువైన ఇత్తడి సామగ్రిని దొంగలు దోచుకెళ్లిన ఘటన అన్నారెడ్డిపాళెంలో చోటు చేసుకుంది. బాధితుల ఫిర్యాదు మేరకు వివరాలు.. అన్నారెడ్డిపాళెం గ్రామానికి చెందిన మామిళ్ల ప్రసాద్ పిల్లల చదువుల నిమిత్తమై రెండు సంవత్సరాలుగా బుచ్చిరెడ్డిపాళెంలో నివాసం ఉంటున్నారు. నిత్యం అన్నారెడ్డిపాళెం వచ్చి సాగుచేస్తున్న పొలాలను, ఇంటిని పరిశీలించి వెళ్తుంటారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో నాలుగు రోజులుగా అన్నారెడ్డిపాళేనికి రాలేదు. గురువారం అన్నారెడ్డిపాళెంలోని ఇంటికి వచ్చి చూడగా తలుపు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా తన పూర్వీకుల నుంచి వస్తున్న ఇత్తడి సామగ్రి కనిపించలేదు. దీంతో బాధితుడు సంగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇత్తడి సామగ్రి విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని అందులో పేర్కొన్నారు. ఈ మేరకు సంగం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేడుకగా గొబ్బెమ్మ నిమజ్జనం



చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లిలో గొబ్బెమ్మ నిమజ్జనాన్ని గురువారం వేడుకగా నిర్వహించారు. గొబ్బెమ్మను విశేషంగా అలంకరించి ట్రాక్టర్‌పై కొలువుదీర్చి గ్రామంలో ఊరేగించారు.గ్రామోత్సవంలో మహిళలు కోలాట ప్రదర్శనతో అలరించారు. అనంతరం ఏటూరు వద్ద ఉన్న వాగులో గొబ్బెమ్మను నిమజ్జనం చేశారు.

కుష్టు సర్వేను పారదర్శకంగా చేపట్టాలి



మాట్లాడుతున్న వైద్యాధికారిణి స్వప్నారెడ్డి

సీతారామపురం: మండలంలో ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు కుష్టు సర్వేను పారదర్శకంగా చేపట్టాలని వైద్యాధికారిణి స్వప్నారెడ్డి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టు సర్వేపై వైద్యారోగ్య సిబ్బందికి గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి కుష్టు సర్వేను విధిగా చేపట్టాలన్నారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, మందమైన మెరిసే జిడ్డు చర్మం, చెవులు, వీపుపై నొప్పి లేని బుడిపెలు, కనురెప్పలు మూతపడకపోవడం, కాళ్లు,చేతులు తిమ్మిర్లు పట్టడం, అరచేయి, అరికాళ్లలో స్పర్శ లేకపోవడం, తదితరాలు కుష్టు లక్షణాలు అని తెలిపారు. అటువంటి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వెంటనే పీహెచ్‌సీకి పంపాలని సూచించారు. కుష్టును ప్రాథమిక దశలో గుర్తిస్తే చికిత్స ద్వారా నయం చేయవచ్చని తెలిపారు. హెల్త్‌సూపర్‌వైజర్లు, వైద్యసిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఎంపీహెచ్‌ఏలు, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఉదయగిరి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు కుష్టు సర్వేను పక్కాగా చేపట్టాలని వైద్యాధికారిణి వినీత సూచించారు. ఉదయగిరిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యారోగ్య సిబ్బందితో కుష్టు సర్వేపై గురువారం ఆమె సమీక్షించారు. ప్రతి ఇంటిని వైద్యారోగ్య సిబ్బంది సందర్శించి శరీరంపై స్పర్శ లేని, రాగిరంగు మచ్చలు ఉన్న వారిని గుర్తించాలన్నారు. కుష్టు లక్షణాలు ఉన్న వారికి తగిన పరీక్షలు చేసి వ్యాధిని నిర్ధారించాలన్నారు. సర్వేపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీహెచ్‌ఓ శివకుమారి, హెల్త్‌ఎడ్యుకేటర్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

- నలుగురికి గాయాలు



ఉదయగిరి వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులు

వరికుంటపాడు: మండలంలోని జంగంరెడ్డిపల్లిలో పాతకక్షల నేపథ్యంలో రెండు కుటుంబాల మధ్యన గురువారం చోటు చేసుకున్న ఘర్షణ లో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. రెండు కుటుంబాల మధ్యన జరిగిన ఘర్షణ కారణంగా జి.కొండారెడ్డిపల్లికి చెందిన నిమర్తి శ్రీనివాసులు, ఉదయగిరికి చెందిన ఆవుల పద్మ, జంగంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నేలటూరి మహేంద్రబాబు, మహేష్‌కు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మహేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘునాథ్ తెలిపారు.

పరామర్శ



దుత్తలూరు: మండలంలోని బ్రహ్మేశ్వరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సూరే భాస్కర్‌రెడ్డి ఇటీవల మరణించగా కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ నాయకుడు మేకపాటి అభినవ్‌రెడ్డి గురువారం పరామర్శించారు. చిన్నవయస్సులోనే భాస్కర్‌రెడ్డి మరణించడం బాధాకరమని, కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అనంతరం దుత్తలూరుకు చెందిన వాశిపల్లి సుబ్బారెడ్డిని పరామర్శించారు. అనారోగ్యంతో వైద్యశాలలో చికిత్స పొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, బ్రహ్మేశ్వరం సర్పంచ్ మీసాల సుబ్బరాయుడు, మాజీ సర్పంచ్‌లు సూరే రమణారెడ్డి, వల్లూరు వెంకటరెడ్డి, నాయకులు కండ్లగుంట వెంకటరెడ్డి, దయాకర్ ఉన్నారు.

పరస్పరం దాడులు

ఆత్మకూరు: బోయలచిరివెళ్లలో బుధవారం అర్ధరాత్రి సమీప బంధువుల నడుమ చిన్నపాటి వివాదం నెలకొని పరస్పరం దాడులు చేసుకుని గాయపరుచుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు అవినాష్, పెంచలయ్య, ఆదినారాయణ, చైతన్య, తదితరులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై జిలానీ తెలిపారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ఆత్మకూరురూరల్: మండలంలోని రామస్వామిపల్లి నుంచి వింజమూరు మండలం నల్లగొండ్ల వరకు రూ.9 కోట్లతో చేపడుతున్న రోడ్డు పనులను ఆత్మకూరు సబ్‌డివిజన్ పంచాయతీ రాజ్ శాఖ ప్రాజెక్ట్ విభాగం డీఈ సుధాకర్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. రామస్వామిపల్లి, బంట్లపల్లి, డీసీపల్లి, వెన్నవాడ బొగ్గేరు, గండ్లవేడు, నల్లగొండ్ల గ్రామాల వద్ద వివిధ దశల్లో జరుగుతున్న పనుల నాణ్యతను పరిశీలించి అధికారులు, కాంట్రాక్టర్లకు సూచనలు చేశారు. ఆయన వెంట జేఈ ప్రసాదరావు, కాంట్రాక్టర్ యర్రంరెడ్డి నాగమోహన్‌రెడ్డి, స్థానిక నాయకులు కొల్లి దొరస్వామినాయుడు, వెలుతుర్ల సుందరరామిరెడ్డి, తదితరులు ఉన్నారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి



కావలి: మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్



ఆత్మకూరురూరల్: మాట్లాడుతున్న ఎంవీఐ రాములు



ఉదయగిరి: మాట్లాడుతున్న సీఐ వెంకట్రావు

కావలి: ఆర్టీసీ డ్రైవర్లు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని కావలి డీఎస్పీ శ్రీధర్ అన్నారు. కావలి ఆర్టీసీ డిపో గ్యారేజ్ ఆవరణలో రోడ్డు భద్రతా మాసోత్సవాలను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కావలి డీఎస్పీ శ్రీధర్, ఒకటో పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎండీ ఫిరోజ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ డ్రైవర్లు ఇంటి సమస్యలను ఇంటి వద్దే వదిలేసి రావాలన్నారు. రోడ్డు భద్రతా నిబంధనలను పాటించి వాహనాలను సురక్షితంగా నడపాలన్నారు. రోడ్డు భద్రత నిబంధనలను పాటించకపోతే ప్రయాణికుల కుటుంబాలతో సహా డ్రైవర్ కుటుంబం కూడా సమస్యలు, బాధలకు గురవుతుందన్నారు. ఆర్టీసీ సంస్థ ప్రతిష్ట మసకబారుతుందన్నారు. కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు మాట్లాడుతూ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా నెల రోజుల పాటు వివిధ కార్యక్రమాల ద్వారా డ్రైవర్లకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) కల్పనారెడ్డి ఆర్టీసీ డ్రైవర్లతో రోడ్డు భద్రతా ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) ఖాదర్‌మొహిద్దీన్, కావలి ఒకటో పట్టణ ఎస్సైలు జానకిరామిరెడ్డి, జమాల్, ట్రాఫిక్ సూపర్‌వైజర్ రామకృష్ణ, మెకానికల్ సూపర్‌వైజర్ శీనయ్య, మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ డీ రవిప్రకాష్, ఉద్యోగసంఘ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ఆత్మకూరురూరల్ : ఆర్టీసీ డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఆత్మకూరు ఎంవీఐ మండ్ల రాములు అన్నారు. ఆత్మకూరు ఆర్టీసీ డిపో గ్యారేజ్‌లో ఆర్టీసీ డీఎం కరీమున్నీసా ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎంవీఐ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలను నివారించడంలో గ్యారేజీ కార్మికుల పాత్ర కీలకమన్నారు. ప్రతి రోజూ బస్సుల టైర్లు, బ్రేకులు, లైటింగ్, తదితరాలను చెక్ చేసి పంపాలన్నారు. డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులను నడిపి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని కోరారు. అసిస్టెంట్ మేనేజర్ రాజకుమార్, ఏఎంఎఫ్ బాబురావు, ఆర్టీసీ గ్యారేజీ కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్లకు ఏకాగ్రత అవసరం

ఉదయగిరి: డ్రైవర్లు ఎంతో ఏకాగ్రతతో వాహనాలను నడిపి ప్రమాదాలను నివారించాలని సీఐ వెంకట్రావు సూచించారు. స్థానిక ఆర్టీసీ డిపోలో మేనేజర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సీఐ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డ్రైవర్లు అజాగ్రత్తగా వ్యవహరిస్తే ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉంటాయన్నారు. ఇతర ఆలోచనలకు తావివ్వకుండా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. కార్మికులు సమన్వయంగా పనిచేసి ప్రమాదాలు లేని డిపోగా ఉదయగిరిని నిలపాలని ఆకాంక్షించారు. ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి, ఆర్టీసీ సిబ్బంది, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.